క్లుప్తంగా

భోజనం, దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న గీతారాణి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో లెప్రసీ రోగులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. సత్యచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలు గీతారాణి పుట్టినరోజు సందర్భంగా ఆమె తండ్రి కొడమాటి వాసుదేవ మూర్తి జ్ఞాపకార్థం దుప్పట్లు అందజేశారు. అనంతరం మహారోగి ఆరోగ్య కేంద్రంలోని సభ్యులకు భోజనం వితరణ చేశారు.

నేడు రాజమహేంద్రి ట్రస్ట్ వార్షికోత్సవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్(మానవీయత, సామాజిక, విద్యాట్రస్ట్) 8వ వార్షికోత్సవాన్ని ఆనం కళాకేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నారు. ట్రస్ట్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఆర్‌వీ సత్యనారాయణ(రెడ్డిబాబు), ఫౌండర్ సెక్రటరీ మతల రమేష్, ట్రస్టు అధ్యక్షులు చలుమూరి సత్యనారాయణ శనివారం ఈ విషయాన్ని ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. ఆర్థిక వెనుకబడిన మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ వై.శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ హాజరవుతారన్నారు.

5 నుంచి సామవేదం ప్రవచన మహాసభలు

రాజమహేంద్రవరం రూరల్: సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకూ ప్రతిరోజూ సాయంకాలం 7 నుంచి శ్రీకల్కి అవతార వైభవం అనే అంశంపై ప్రవచనాలు నిర్వహించనున్నారు. రాజమహేంద్రవరం శివారు కొంతమూరులో ఆయన నిర్మించిన వల్లభ గణపతి ఆలయంలో ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకూ గణపతి నవరాత్ర మహోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా ప్రవచన మహాసభలు నిర్వహించనున్నారు. విష్ణుపురాణం, భాగవతం, విష్ణుధర్మోత్తర పురాణం, భవిష్య పురాణం, మహాభారతం, కల్కిపురాణాదుల ఆధారంగా సామవేదం సమగ్రమైన కల్కి అవతార వైభవాన్ని వివరిస్తారని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యుడు, భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

కడియం: డ్వాక్రా రుణాలను అందిపుచ్చుకుని, మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. పువ్వులతో అగరబత్తీల తయారీపై డ్వాక్రా మహిళలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇస్తున్న శిక్షణను శనివారం ఆయన ప్రారంభించారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దశల వారీగా మహిళలు, వారి కుటుంబ సభ్యులకు శిక్షణ ఇస్తామన్నారు. ఒక్కో బ్యాచ్‌కు వారం రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ విధానం, లక్ష్యాలను ఎంపీడీవో కె.రత్నకుమారి వివరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	సరిపోదా శనివారం
సూర్యమినీ	:	డిమోంటీ కాలనీ 2
సూర్యప్యాలెస్	:	సరిపోదా శనివారం
స్వామి	:	సరిపోదా శనివారం
అశోక	:	ఆయ్
శివజ్యోతి	:	మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
అనుశ్రీ	:	కమిటీ కుర్రోళ్లు
రాజా	:	సరిపోదా శనివారం
రంభ	:	డబుల్ ఇస్మార్ట్
ఊర్వశి	:	తంగలాన్
మేనక	:	రాయన్
కుమారి	:	అహో విక్రమార్క
అప్సర నామవరం	:	సరిపోదా శనివారం
వీఎస్ మహల్ ధవళేశ్వరం	:	సరిపోదా శనివారం
మురళీకృష్ణ కడియం	:	సరిపోదా శనివారం
వెంకటసూర్య	:	సరిపోదా శనివారం

వాన నీటితో ముంపు తిప్పలు

- చినుకు పడితే మునకే
- ధవళేశ్వరంలోని కొన్ని ప్రాంతాల దుస్థితి



ధవళేశ్వరం సిద్ధార్థ నగర్‌లో నిలిచిన నీరు



ధవళేశ్వరం కాటన్‌పేటలో ముంపునీరు

ధవళేశ్వరం: చినుకు పడితే ఆ ప్రాంత వాసులకు చింతే. చిన్నపాటి వర్షానికి సైతం నీరు నిలిచిపోతోంది. అది బయటకు వెళ్లే మార్గం లేక అవస్థలు పడుతున్నారు. వేరే దారిలేక వర్షం నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ధవళేశ్వరంలోని సిద్ధార్థ నగర్ కాలనీ దుస్థితి ఇది. అలాగని ఇదేదో కొత్తగా ఏర్పడిన కాలనీ కాదు. గ్రామం నడి బొడ్డున ఉంది. కానీ డ్రైనేజీ వ్యవస్థ లేక కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వాన పడితే కష్టాలే..

వర్షం పడితే ఈ కాలనీ వాసులకు కష్టాలు మొదలవుతాయి. వర్షం నీరంతా రోజుల తరబడి రోడ్డుపైనే నిలిచిపోతుంది. చేసేది లేక ఆ నీటిలోనే రాకపోకలు సాగిస్తారు. ఒక్కోసారి వాహనాలు జారిపడి పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం నీటిలో పాములు సంచరిస్తున్నాయి. అవి ఇళ్లలోకి చేరుతుండడంతో కాలనీ వాసులు బెంబేలెత్తుతున్నారు. నిల్వ నీటి గురించి పదేపదే విజ్ఞప్తి చేసిన తర్వాత అధికారులు వచ్చి మోటార్లు పెట్టి నీటిని తోడుతున్నారు. అయితే సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. ముంపు సమస్యకు ప్రధాన కారణం ఇక్కడ డ్రైనేజీలు లేకపోవడమే. దీంతో వర్షం కురిసినప్పుడల్లా ముంపు సమస్య ఏర్పడుతోంది.

మరో ప్రాంతంలోనూ..

గ్రామంలోని ఇత్తడి ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న సాయినగర్‌లో కూడా డ్రైనేజీలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నారు. నీరంతా కాలనీలోని ఖాళీ స్థలాల్లోకి చేరుతోంది. వాటిలో దోమలు వృద్ధి చెంది, ఈ ప్రాంత వాసులకు కంటిమీద కునుకు ఉండడం లేదు. తరచూ అనారోగ్యాలకు గురవుతున్నారు. అలాగే వాడకం నీరు కూడా బయటకు వెళ్లే దారిలేక అవస్థలు పడుతున్నారు. గతంలో అనేక సార్లు డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. సుమారు 20 ఏళ్ల క్రితం ఏర్పడిన ఈ కాలనీలపై నేటికీ అధికారులు దృష్టి సారించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాటన్ పేట, అగ్రహారం ప్రాంతాలు కూడా చిన్నపాటి వర్షానికే ముంపు బారిన పడుతున్నాయి.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ: తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. ప్రజలు ఏ సమస్య వచ్చినా ఈ నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. ఇక్కడ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారు.

కలెక్టర్ కార్యాలయం	89779 35609
ఆర్డీవో కార్యాలయం	08832-442344
రూరల్ తహసీల్దార్ ఆఫీసు	0883-2416005
కడియం	76590 66699
అర్బన్	94946 62219

మహిళా కారాగారం సందర్శన



మహిళా జైలులో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

కంబాలచెరువు: సెంట్రల్ జైలులోని మహిళా కారాగారాన్ని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు శనివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ చట్టంతో విభేదించిన బాలలను గుర్తించి, న్యాయస్థానాల ముందు వారి బాల్యాన్ని నిరూపించుకోవడానికి అవసరమైన చట్టపరమైన సహాయాన్ని అందించేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన వారు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, పారా లీగల్ వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకుని న్యాయ సహాయం పొందవచ్చన్నారు.

కేసులను త్వరితగతిన పరిష్కరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ డి.నరసింహ కిశోర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ చుట్టుపక్కల పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించి, నమోదైన గ్రేవ్ కేసులపై ఆరా తీశారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. బ్లూకోల్ట్స్, రక్షక్ మొబైల్ గంట గంటకూ తమ లొకేషన్ మార్చుకుంటూ అప్రమత్తంగా తిరుగుతూ కంట్రోల్ రూమ్‌కు తెలిపాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలన్నారు. అక్రమ మద్యం, గంజాయి, సారా రవాణాను నియంత్రించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేయాలన్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

గిరిజనులపై ప్రభుత్వం చిన్నచూపు



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్

కంబాలచెరువు: జామిగుడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 79 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో దానికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక మావోభవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గిరిజనులపై చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణమన్నారు. వనం - మనం కార్యక్రమాల మీద ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఉన్న దృష్టి.. సంక్షేమ హాస్టల్‌పై లేకపోవటం సిగ్గుచేటన్నారు. మొక్కలకు ఇచ్చే విలువ విద్యార్థుల ప్రాణాలకు ఇవ్వరా అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ , గిరిజనశాఖ మంత్రి సంధ్యారాణి దీనిపై నోరు మెదపకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కె.భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికులను తొలగించడం అన్యాయం



నిరసన తెలుపుతున్న రైల్వే బాక్స్ బాయ్స్

రాజమహేంద్రవరం సిటీ: రైల్వేలో 25 ఏళ్లుగా బాక్స్ బాయ్స్‌గా పనిచేస్తున్న కార్మికులను పనుల నుంచి తొలగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమ రాజు అన్నారు. వారిని వెంటనే పనిలోకి తీసుకోవాలని, లేని పక్షంలో రైల్వేలో వేరే పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల తొలగింపునకు నిరసనగా శనివారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో నిరసన తెలిపారు. రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధ)శాఖ కార్యదర్శి బి.శ్రీనివాస్, బాక్స్ బాయ్స్ పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సత్కరిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: విధి నిర్వహణలో చేసిన నిస్వార్థ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. పోలీసు విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన అధికారులను శనివారం ఆయన సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె.శ్రీనివాసులు, ఎస్సై టి.రాంబాబు, ఎస్సై కె.నాగరాజు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వి.రాములును ఘనంగా సత్కరించారు. వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందించారు. శాఖాపరంగా ఏ అవసరం ఉన్నా స్వయంగా వచ్చి తనను కలవచ్చని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు అల్లూరి వెంకట సుబ్బరాజు, ఎస్.రాజశేఖరరావు, ఎల్.చెంచిరెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు ఆర్.రఘురాం, జె.సాయిమహేష్ తదితరులు పాల్గొన్నారు.



డాక్ సేవక్ బాషాను సత్కరిస్తున్న పోస్టల్ సిబ్బంది



పుల్లమాంబ దంపతులను సత్కరిస్తున్న అధికారులు

డాక్ సేవక్ బాషాకు సత్కారం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని ప్రకాశం నగర్ పోస్టాఫీసులో డాక్ సేవక్‌గా విధులు నిర్వహించిన ఎస్‌కే బాషా శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా బాషా సేవలను పోస్టు మాస్టర్ వనజ కొనియాడారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్యామ్ సుందర్ ఆదేశాల మేరకు పోస్టాఫీసులో ఎస్‌కే బాషా, అహ్మదున్నీసా దంపతులను సహచర సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఈ సెక్రటరీ కొండబాబు, పోస్టల్ అసిస్టెంట్ ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పుల్లమాంబ సేవలు అభినందనీయం

సీనియర్ అసిస్టెంట్ పుల్లమాంబ పనితీరు అభినందనీయమని జిల్లా సమాచార పౌర సంబంధాలు అధికారి సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో 37 ఏళ్లు టైపిస్ట్‌గా, సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన నేతల పుల్లమాంబ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆనం కళాకేంద్రం సర్వరాయ కళా వేదికలో పుల్లమాంబ, శ్రీనివాస శర్మ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీపీఆర్వో ఐ.కాశయ్య, డివిజనల్ పీఆర్వో ఎం.లక్ష్మణాచార్యులు, సహాయ సమాచార కార్యనిర్వాహక ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వర్లు, సహాయ ఇంజినీర్ కె.శాంతికుమారి, లైబ్రేరియన్ వి.శేఖర్, టైపిస్టు సీహెచ్ రామకృష్ణ, ఈ.సురేష్, జూనియర్ అసిస్టెంట్ కె.సోమశేఖర్ పాల్గొన్నారు.

పిఠాపురానికి కడియం మొక్కలు

కడియం: పిఠాపురం నియోజకవర్గంలో క్లీన్ పిఠాపురం - గ్రీన్ పిఠాపురం కార్యక్రమంలో భాగంగా మొక్కలు పంపిణీ చేసేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిరుసేవా సమితి వ్యవస్థాపకుడు గెడ్డం శివరత్న గణపతి (శివ) ఆధ్వర్యంలో వివిధ రకాల పండ్లు, ఫారెస్ట్ రకాలకు చెందిన 12 వేల మొక్కలను పిఠాపురానికి తరలించారు. ఈ మేరకు మొక్కల రవాణా వాహనాన్ని శనివారం కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంక నుంచి పంపించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి దుర్గేష్ పరామర్శ

కడియం: దుళ్ల ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు తటవర్తి వీర్రాజు మృతికి మంత్రి కందుల దుర్గేష్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన శనివారం వీర్రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీర్రాజు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

సారా విక్రేతకు రిమాండ్

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన పీత వీరన్నకు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ బొబ్బిల్లంక ఏటిగట్టుపై సారా విక్రయిస్తుండగా వీరన్నను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి



కడియపులంకలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్వరూప

కడియం: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రభుత్వాసుపత్రి వైద్యులు సూచించారు. ఈ మేరకు కడియం, కడియపులంక పంచాయతీ పరిధిలో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. కడియం సచివాలయం 3 పరిధిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 57 మందికి వైద్య పరీక్షలు చేయగా, వారిలో 24 మంది జ్వరంతో ఉన్నట్లు గుర్తించారు. 8 మందికి డెంగీ, 16 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఎం.రామకృష్ణ, కృష్ణ కుమారి, సీహెచ్ విల్సన్ పాల్, వి.వినీల, పి.ప్రవల్లిక, సునీత, నిర్మల, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

- కడియపులంక ఎస్సీపేట ఏరియాలో నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు స్వరూప, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సేవలందించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సురక్షిత భవనాలకు హాస్టల్ విద్యార్థుల తరలింపు

రాజమహేంద్రవరం సిటీ: భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని ఆరు సంక్షేమ వసతి గృహాలలో ఉన్న విద్యార్థులకు పక్క భవనాల్లో తాత్కాలిక వసతి కల్పించినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఆమె శనివారం మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు ఎస్సీ, రెండు బీసీ సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులకు సురక్షిత భవనాలలో తాత్కాలిక బస ఏర్పాటు చేశామన్నారు. రాజానగరం బీసీ కాలేజీ బాలుర వసతి గృహంలోని 60 మందిని రాజమహేంద్రవరం కంబాల చెరువు వై.జంక్షన్ సమీపంలోని బీసీ వసతి భవనంలోకి, అలాగే కోరుకొండ బీసీ కాలేజీ బాలికల వసతి గృహంలోని 17 మంది బాలికలను రాజమహేంద్రవరంలోని బీసీ బాలికల వసతి గృహానికి తరలించామన్నారు. అలాగే నల్లజర్ల ఎస్సీ సంక్షేమ వసతి గృహంలోని 37 మంది, కోరుకొండలో 25 మంది, కొవ్వూరులో 35 మందిని సమీపంలోని ఎంపీపీ స్కూళ్లలోకి, ఉండ్రాజవరంలో 27 మందిని సమీపంలోని ప్రైవేటు భవనంలోకి మార్పు చేసినట్టు తెలిపారు. గతంలో ముంపు ప్రభావిత ప్రాంతాలలో ఆయా వసతి గృహాలు ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో ముందస్తు భద్రత దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ముంపు నివారణలో భాగంగా రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాల్లోని డ్రైనేజీల్లో సిల్ట్‌ను తక్షణం తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శానిటేషన్, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలను జారీ చేశామన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఆదివారం కూడా మండల కేంద్రంలో అందుబాటులో ఉండాలన్నారు.

వరినాట్లకు వరుణ గండం

- తుపాను హెచ్చరికతో రైతుల బెంబేలు
- ఇప్పటికే ఒకసారి దెబ్బతిన్న నాట్లు
- రెండోసారి వేస్తున్న వైనం
- ఈసారి మునిగితే ఖరీఫ్ కష్టమే..



చినకొండేపూడి - చీపురుపల్లి మధ్య పొలంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

సీతానగరం: ఎన్నో ఆశలతో ఖరీఫ్ సాగు చేపట్టిన రైతులకు కాలం కలిసిరాలేదు. నాట్లు వేసింది మొదలు వాతావరణం అనుకూలించడం లేదు. జూలైలో ఎంతో ఉత్సాహంగా వరినాట్లు వేసిన 15 రోజులకే వరుణుడు విశ్వరూపం చూపించాడు. ఎడతెరిపి లేకుండా వారం, పది రోజుల పాటు వాన కురిపించాడు. దీంతో పొలాలు ముంపు బారిన పడ్డాయి. గోదావరికి వరద రావడంతో ఎక్కడికక్కడ పంటలు మునిగిపోయాయి. గోదావరిలో కలిసే వీలులేక కాలువలు వెనక్కి ప్రవహించాయి. దీంతో పొలాలన్నీ చెరువుల్లా మారాయి.

రెండోసారి నాట్లు

జూలై నెలలో కురిసిన వర్షాలకు ముంపులోకి వెళ్లిన కొన్ని వందల ఎకరాలు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. నీరు లాగిన పొలాల్లో నాట్లు దెబ్బతిన్నాయి. దీంతో రెండోసారి వరినాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఆకుమడిని సేకరించుకుని మళ్లీ సాగుకు సమాయత్తమయ్యారు. కొన్ని చోట్ల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అయితే మరోసారి తుపాను హెచ్చరికలు రావడంతో కంగారు పడుతున్నారు. రెండు రోజులుగా వర్షాలు కూడా కురుస్తున్నాయి. వాతావరణం ఇలాగే కొనసాగితే ఇప్పుడు వేస్తున్నవరినాట్లు కూడా దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు. ఈసారి కూడా ముంపు సమస్య ఏర్పడితే ఇక రబీ వరకూ సాగు చేయలేమని స్పష్టం చేశారు.

కొండ గోదారి ఎగపోటు

జూలైలో గోదావరి వరదతో బొబ్బిల్లంక వద్ద స్లూయిజ్ నుంచి కొండ గోదావరి నీరు తరలివెళ్లే అవకాశం లేకపోవడంతో ఎగపోటు పట్టింది. దీనితో కోరుకొండ మండలంలో మూడు వేలు, సీతానగరం మండలంలో 9 వేల ఎకరాలు ముంపులోకి వెళ్లాయి. వాటిలో కొన్ని పొలాలు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. గోకవరం , కోరుకొండ మండలాలలో కొన్ని గ్రామాలలో కురిసిన వర్షం నీరు, సూరంపాలెం ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన మిగులు జలాలన్నీ బురద కాలువ ద్వారా బొబ్బిల్లంక కాలువకు చేరుకున్నాయి. అక్కడి నుంచి బొబ్బిల్లంక స్లూయిజ్ తలుపులు నుంచి గోదావరిలో కలవాలి. అయితే గోదావరికి వరద వస్తే స్లూయిజ్ తలుపులు మూసుకుపోతాయి. దీంతో కొండ గోదారి నుంచి వెనక్కి తన్ని పొలాలను ముంచెత్తుతోంది.

ముమ్మరంగా వరినాట్లు

జూలైలో కురిసిన వర్షాల కారణంగా ముంపులోకి వెళ్లిన పొలాల్లో ఆరు వేల ఎకరాలు ముంపు నుంచి బయటపడ్డాయి. వాటిలోని రెండు వేల ఎకరాల్లో రెండోసారి వరినాట్లు వేసే ప్రయత్నంలో రైతులు ఉన్నారు. కొందరు మెరక పొలాల్లో వరినారుమడులు కట్టి తమ పంటపొలాల్లో వరినాట్లు వేస్తున్నారు. మరి కొంతమంది రైతులు ఎకరానికి రూ.5 వేలు ఖర్చు చేసి వరి ఆకును కొనుగోలు చేస్తున్నారు.

ఖరీఫ్ లేనట్టేనా..

జూలైలో ముంపులోకి వెళ్లిన 9 వేల ఎకరాల్లో 6 వేల ఎకరాలు బయటపడ్డాయి. ఇంకా మూడు వేల ఎకరాలు అలాగే ఉన్నాయి. ముంపు నుంచి బయటపడ్డ పొలాల్లో రెండు వేల ఎకరాల్లో రెండోసారి వరినాట్లు వేశారు. మిగిలిన నాలుగు వేల ఎకరాల్లో పలుసగా వరినాట్లు వేశారు. కోరుకొండ మండలంలో మూడు వేల ఎకరాలు ముంపులోకి వెళ్లగా వెయ్యి ఎకరాలు అలాగే ఉన్నాయి. సీతానగరం మండలం చినకొండేపూడిలో 500, సింగవరంలో 100, రఘుదేవపురంలో 300, నల్గొండలో 400 ఎకరాలతో పాటుగా మిగిలిన గ్రామాల్లో 1,700 ఎకరాలు ముంపు నుంచి బయటపడలేదు. దీంతో అక్కడ ఖరీఫ్ సాగు లేనట్టేనని రైతులు చెబుతున్నారు. అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే రబీలో మొక్కజొన్న పంటలు వేయాల్సిందేనన్నారు.